ప్రైమ్మినిస్టర్   హాస్యవ్యాసం


ముద్దుకృష్ణ


'మానవుల చర్యలు చూస్తున్న కొద్దీ కుక్కలమీద గౌరవం హెచ్చుతూ వున్న'దని ఒక ఫ్రెంచి వ్యాసకర్త వ్రాసినాడని చెప్తూ, మా ప్రైమ్మినిస్టరును తట్టినాడు నా స్నేహితుడు. తగిన బాహ్యచిహ్నలతో కృతజ్ఞత చూపుతూ 'ఔను' అన్నది ప్రైమ్మినిస్టర్.

ప్రైమ్మినిస్టరంటే చాలామందికి తెలియదు. మా పెంపుడుకుక్క. ఈ పేరు పెట్టడానికి చాలా కారణాలున్నవి. ప్రస్తుతం అన్ని పాశ్చాత్య దేశాలలో అందులో ముఖ్యంగా ఇంగ్లాండులో ప్రధానమంత్రిత్వం స్వభావం కుక్కవంటిది. గాలికదిలినా ఏ దేశమో, ఏ విరోధిజాతో దండయాత్రబయలు దేరి వొస్తూవున్నదని అనుమానపడి, భోంయిమని దేశమంతా అల్లరి చేయడం; తన దేశాన్నీ ప్రజలనీ కావలికుక్కవలె కాపాడుతున్నా ననుకుని, ఇతర దేశస్థులు పెద్దమనుష్యు లెవరైనా సదుద్దేశంతో సవినయంగా ఏకోర్కలు తెలపడానికో, ఏహక్కులనుగురించి అడగడానికో వొస్తే ఇంట్లో వాళ్లు మేలుకుని పట్టుకునేలోపుగా గొల్లుమని ముందడుగు వేసిన సాహసికుణ్ణి వీలైతే కాలు పట్టికరవడం.

మాకుక్కకు ఈ పేరుపెట్టడానికి ఈ సమానలక్షణాలే కాకుండా ఇంకో కారణంకూడా వున్నది. నామకరణం అంటే మజాకాదు. పిల్లలుగలవాళ్లకి తెలుసును ఈపాట్లు. తొమ్మిదినెలలూ, పుట్టినతరవాత నామకరణం చేసే వరకూ మంచిపేరు పెట్టవలెననీ ఎంత ఆలోచించినా, ఎన్ని పేర్లు వెతికినా ఒక్కటీ తోచక పోవడం పాతపేర్లు ఒక్కటీ అతక్కపోవడం చివరకు ప్రాణంవిసిగి ఆసమయానికి ఏ అమ్మమ్మో ఆగ్రహిస్తే తప్పనిసరిగా ఆవిడ అసహ్యమైన పేరే పెట్టడం మామూలు.

కుక్కపిల్లను కొందా మనుకున్నప్పటి నుంచీ ఆలోచించాను పేరునుగురించి; స్నేహితుల నేకమందిని అడిగాను.

విక్టోరియా హాస్టలు విద్యార్థులు నవనాగరికులు 'ఫేషనబులుగా' వుంటారని వాళ్ల నడిగితే యూరోపియన్ పేర్లు బాగావుంటవి అన్నారు. కొందరు నాన్కోపరేషను వాళ్ల నడిగితే, 'డయరు, ఓడయరు, క్లయివు, నీలు' ఏదైనా పెట్టమన్నారు కసిగా. ఇంకా ఇతరులు, టైగర్, ఫైడెలిటీ, ఫైత్ఫుల్, లిలీ, బూచి, సీజర్, ఏవో చాలా చెప్పేరు. ఏదీ నాకు నచ్చలేదు. కాలమే నిర్ణయించింది తుదకు.

కుక్కపిల్లను కొన్నానిమిషం ఒక స్నేహితుడువచ్చి, 'వార్తాపత్రిక చూశావా. ఇంగ్లాండులో ఎన్నికలు తెలిసినవి. ప్రైమ్మినిస్టరును

ఎన్నుకున్నా' రన్నాడు. ప్రధానమంత్రి, ఆప దవీగురించి చాలా మాట్లాడు కున్నాము. వెంటనే తోచింది ఆపేరే కుక్కకు పెట్టవలె నని. ఒకదౌర్భాగ్యపు కుక్కపిల్లకు పేరు పెట్ట డానికి ఇంతగోలా, ఇంతశ్రమా ఎందుకు అం టారు చాలామందిబుద్ధిమంతులు.

కుక్క అంటే సామాన్యమైన జంతువు కాదు. విశ్వాసంలో స్నేహితుణ్ణి మించినది. కాపుదలలో బంటును అతిక్రమించినది. దేశచ రిత్రలలో శాశ్వతంగా యశస్సుగడించిన మహా పురుషులతో సమంగా అనేకశునకాల పేర్లు కూడా కాలాన్ని ధిక్కరించి, మృత్యువు నెదిరించి జీవన్మృతములైనవి. మొన్ననేవిన్నాము (శ్రీ) శివాజీమహారాజు చనిపోయినప్పుడు ఆయనచితిలోనికి ఉరికి మృత్యువులో కూడా ప్రభువు ననుసరించిన ఆయన పెంపుడుకుక్క చరిత్ర. జాతీయ ధర్మాలను, గౌరవాన్ని కాపాడుకో వలెనన్న సంగతి కన్నులువిప్పి గ్రహించిన భారతీయులు ఆశునకశ్రేష్ఠానికి వొకపెద్దఘోరీ కట్టించి దానిపేరూ, యశస్సు స్థిరంగా నిల్పడానికి ప్రయత్నిస్తున్నారు. దేశ గౌరవాన్ని కాపాడడానికి ప్రాణాలర్పించిన నెల్సను, కిచెనరువంటి వీరాగ్రేసరులతో తుల తూగే హెల్వెల్లెనుకుక్క, ల్యూవెల్లెనుకుక్క, ఇంకా అనేక శునకాలున్నవి. ఏదోవంశాన్ని నిలుపుతాడనుకుంటే మైనారిటీ తీరగానే పం పకానికి నోటీసిచ్చే పుత్రుని నామకరణానికి పడేశ్రమలో కొంతశ్రమైనా పడకూడదా మానమూ, ప్రాణమూ, ధనమూ కాపాడేం దుకు ప్రాణాలైనా అర్పించే విశ్వాసపాత్రమైన దానికి సరియైనపేరు పెట్టడానికి!

మానవులచర్యలు చూస్తున్న కొద్దీ, కుక్కలమీద గౌరవం హెచ్చకపోయినా, ఈరెండుజాతులకూ చాలాపోలికలు కనిపించ గలవు. కుశాగ్రంగా చూస్తే, ఇంగ్లీషువాడికి బుల్డాగ్కుండే పట్టుదలా, కావలికుక్కకుండే జాగరూకతా వున్నవి. నోటితో బుట్టపట్టు కుని బజారుపని చేసుకుని వొచ్చే కుక్కలు న్నవి. ఆజాతిలోనివాడు అమెరికా వాడు. ఒకగొర్రెలకాపరి కొండనెరియలోపడి చని పోతే నిద్రాహారాలు మాని, ఆ అస్థిపంజ రాన్ని కనిపెట్టుకున్న కుక్కకథ విన్నాం. ఆజాతిలోనివాడు కానాబయాంకా. స్కాచ్చి వాడు వేటకుక్కజాతిలో వాడు; బుద్ధికుశలత లోనూ, చురుకుతనంలోనూ ఫాక్సుటెర్రియరు జాతిలోవాడు ఐరిషువాడు. రష్యావాడు మం దకుక్కజాతిలో వాడు. అరవవాడు ఊరికే మొరిగే జాతిలోవాడు. బెంగాలీవాడు చడీ చప్పుడూ లేకుండా పిక్కపట్టుకునే జాతిలో వాడు.

ఒక్కకుక్కజాతే కాదు. ఇతర జంతువు లకూ మానవులకూ సమానలక్షణా లున్నవి. హిందువుడు పిల్లిజాతిలోవాడు. అందుచేతనే కుక్కను ముట్టుకుంటే అంటని వొంకపెట్టేము. పిల్లికీ కుక్కకూ అసలేపడదు గదా. పిల్లి ఎప్పుడూ ఇల్లుకనిపెట్టి వుంటుంది. దానికి యజ మాని మనుష్యులూ సంబంధం లేదు. సాధ్య మైనంతవరకూ వొకరిశోంఠీ, వొకరిజోలీ అఖ

న్లేదు. మచ్చికచేస్తే దగ్గరగావొస్తుంది, కాని ఎంతలాలించినా, ఎంతవూరించినా వెంటరాదు. ఇల్లే కనిపెట్టుకుని ఉంటుంది.

పాశ్చాత్యుడు కుక్కజాతిలోని వాడు. వీనికి ప్రదేశంతో సంబంధంలేదు. కుక్క యజమానిని విశ్వసించినట్టుగా ఇతడు ధనాన్ని నమ్ముతాడు. తోకాడిస్తూ ఆవెంట బడతాడు. ఎంతైనా వోర్చి తెగించి కాపలాకాస్తాడు. ఇంకొకరిని ముట్టనియ్యడు. ఈయజమాని ఎక్కడ వుంటే అక్కడ వుంటాడు.

బాగా ఆలోచిస్తే ఈపోలికలు చాలా నిజంగా కనపడగలవు. కుక్కకు పిల్లి లోకువ గదా! ఆలాగా పాశ్చాత్యుడికి హిందువుడు లోకువ. ఇంకోసంగతి, ఇల్లు పాడైపోయినా పిల్లివదలదు. ఏదోవిచారంగా నశించిన గొప్పనుగురించి కాబోసు కలలుగంటూ అక్కడే పడివుంటుంది. కుక్క ఆలా కాదు. ఇల్లుపాడైతే యజమానితోపాటు మకాం ఇట్టేమారుస్తుంది. దానికి స్థలం కొత్తలేదు. జోస్తీ అతిత్వరితంగా చేస్తుంది. ఒకముక్క పారవేసినా, కొంచం చనువుగాతట్టినా, సస్నేహంగాచూపినా, 'థ్యేంక్యూ' అని తోకాడిస్తూ కృతజ్ఞత వెంటనే చూపుతుంది. పిల్లికి ఈపేచీలు ఏమీ చేతకావు. స్థలం చచ్చినా మార్చదు కదా! ఎంతో చనువుగాచూస్తేనేగాని దగ్గఱకు రాదు. ఒకవేళ వొచ్చినా మ్యావని ఒకసారిరాసుకుని మళ్లీ వెంటనే నీజోలి నాకెందుకు, నాజోలి నీకెందుకన్నట్టు వేదాంతంగా వెళ్లిపోతుంది.

హిందూపాశ్చాత్య భేదం చూడండి. ఈ విషయాల్లో, పాశ్చాత్యుడు టిక్కెట్టు మారకపోతే స్వదేశం నుంచైనా ఇట్టే మకాం మారుస్తాడు. స్థలం కొత్తలేదు. వీలైతే భోం యిమని భయపెట్టి, లేకపోతే తోకఆడిస్తూ 'థేంక్యూ'లతో స్నేహంచూపుతూ కార్యం నిర్వహిస్తాడు. హిందువుడు చచ్చినా దేశం వదలడు. ఆట్టే ఎవరితోనూ పూసుకుని తిరగడు. వెలిగా వుంటాడు. ఎంతసేపూ పాడు యింట్లోపిల్లిలా నశించిన తాతముత్తాతల గొప్ప, గౌరవం తలుచుకుంటూ స్వప్నాలలో శ్మశానదృష్టితో జపం చేస్తుంటాడు.

జంతుజాలానికి వుండేశక్తులు తక్కువ కావడంవల్ల అవి యెప్పుడూ ప్రకృతిని అనుసరించి వొకేపంథాను వెళ్లుతూ వున్నవి. మనుష్యులకు బుద్ధి అధికంగా ప్రసాదించడంవల్ల ఒకఅడుగు ఇటువేసినా ఒకఅడుగు అటువేసినా ప్రకృతికి మహాదూరంగా పోయి అతీతుడో, అధమాధముడో అయిపోతున్నాడు. తప్పుదారులు తొక్కుతున్నా మానవాళిని చూసి ఫ్రెంచివ్యాసకర్త కుక్కలమీద గౌరవం హెచ్చు చేసుకున్నాడు. కేవలం ఈశతాబ్దంమనుష్యులమీద నిరసన, హేయత చూపడానికి శునకాలమీద గౌరవం హెచ్చించుకున్నా వ్యాసకర్త మాప్రైమ్మినిస్టరులాంటి శునకశ్రేష్ఠాన్ని దానిచురుకు, సుగుణాలనే అవగాహన చేసుకుంటే ప్రైమ్మినిస్టరుని, ఆజాతిని పూజించేవాడనుకుంటాను.